సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 7 । జూలై । 2024



వ్యాక్సిన్లే రక్ష

పశువులకు వ్యాధులు ముసురుతున్నాయి. వ్యాక్సిన్లే వీటికి రక్ష.

- 8లో



నెలలో ఇన్ని దారుణాలా..?

నారువలో వైఎస్సార్ సీపీ నాయకుడి కారును తగులబెట్టారు. దీన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ఖండించారు.

- 8లో

బాధిత రైతులకు వరి విత్తనాలు

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, మాతల, వసపతో పాటు పలు గ్రామాల్లో వరి మొలకెత్తక పోవడంతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు అధికారులు స్పందించి ఈ నెల 4న పొలాలను పరిశీలించి బాధిత రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. అధికారులు ఇచ్చిన మాట ప్రకారం బాధిత రైతులకు ఉచితంగా వరి విత్తనాలు అందజేశారు. విత్తనాలు వేయలేకపోయిన రైతులకు నగదు వాపస్ ఇచ్చారు.

న్యూస్‌రీల్

ఐదో తరగతిలో ఖాళీ సీట్లకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ ద్వారా నిర్వహిస్తున్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 8న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు దుప్పలవలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హత గల ఎస్సీ విద్యార్థులు ప్రవేశాలు కోరుకునే పాఠశాలలకు వెళ్లి, లాటరీ ద్వారా హాజరైన విద్యార్థులకు ఖాళీ సీట్లలో ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌జెండర్లకు సర్టిఫికెట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో హిజ్రాలకు కేటాయించిన సౌకర్యాలు, రాయితీలను పొందేందుకు, అవసరమైన సహాయాన్ని అందించేందుకు గుర్తింపు కార్డు కోసం వైద్య ధ్రువీకరణ / ఐతే కార్డుల జారీ చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సహాయ సంచాలకులు కె.కవిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఆర్థిక సాయం పొందాలనుకున్నా, పింఛను, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇతర ప్రయోజనాలకు, ప్రభుత్వ పథకాలకు ఈ పత్రాల అవసరం ఉంటుందని పేర్కొన్నారు. 'హిజ్రాలు' అని గుర్తింపుపొందటానికి నోటరీ అఫిడవిట్ చేయించుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సందేహాలు ఉంటే కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం



ధ్వంసమైన మందస మండలం సొండిపూడి సచివాలయ శిలాఫలకం

కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి సచివాలయంలో శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. శుక్రవారమే ధ్వంసం చేయగా శనివారం విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై సర్పంచ్ చిచ్చుల నళిని శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, స్థానికులు మండల పరిషత్ కార్యాలయం, మందస పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు.

ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుతం పోస్టు గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు రిలీవ్ అవుతున్నారు. రిలీవ్ అయ్యే విద్యార్థులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, మార్కుల జాబితాలు, ఉత్తీర్ణత ప్రొవిజనల్, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ సర్టిఫికెట్లు తీసుకోవాలంటే తప్పనిసరిగా ఫీజులు చెల్లించాలి. విద్యా దీవెన, వసతి దీవెన వర్తించే విద్యార్థులకు చివరి విడత ఫీజులు పడలేదు. దీంతో మెస్ బకాయిలు, మిగిలిన ఫీజులు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాల్సి వస్తోంది. వసతి దీవెన, విద్యా దీవెన నగదు తల్లుల ఖాతాల్లో పడతాయని, కళాశాలలకు రావాల్సిన ఫీజు చెల్లించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఇతర ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు బకాయి ఫీజులు చెల్లించి పత్రాలు తీసుకుంటున్నారు.

వీసీకి మద్దతుగా సంతకాల సేకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజినికి మద్దతుగా శనివారం సంతకాలు సేకరించారు. వీసీ రాజీనామా చేయాలంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యాలయం నుంచి తీవ్ర ఒత్తిళ్లు, హెచ్చరికలు వస్తున్నాయి. అయినా ఆమె ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ప్రత్యక్షంగా ఆందోళన చేసి రాజీనామా చేయాలని ఆమె చాంబర్‌లో నిలదీసినా ఆమె వెరవలేదు. ఆమె జనవరి 18న వీసీగా నియమితులయ్యారు. సాధారణంగా మూడేళ్ల పాటు ఆమె టెర్మ్ ఉంటుంది. కానీ ఇంకా ఆరు నెలలైనా కాక ముందే రాజీనామా చేయాలని ఒత్తిళ్లు వస్తున్నాయి. బీఆర్‌ఏయూలో ప్రభుత్వాల మార్పులతో సంబంధం లేకుండా ఇప్పటి వరకు అందరు రెగ్యులర్ వీసీలు మూడేళ్ల పాటు కొనసాగారు. ప్రస్తుతం వీసీ విషయంలో మాత్రం రాజీనామాకు ఒత్తిడి చేస్తున్నారు. మరో పక్క దళిత సంఘాలు, దళిత మేధావులు, మహిళా ఉద్యోగులు, వర్సిటీ వర్గాలు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. ఆమె కొనసాగింపు కోసం సంతకాలు సేకరించి రాష్ట్రపతి, గవర్నర్, ఇతర ప్రముఖులకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. మరో పక్క రాజకీయ ఒత్తిళ్లు పక్కన పెట్టి పాలనపై ఆమె ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.



తారు పూత పూసుకున్న దారులన్నీ ఎప్పుడో అప్పుడు రక్తంతో తడిచినవే. మళ్లీ దానికి రక్త తర్పణం ఇవ్వకూడదంటే హెల్మెట్ నీడన తల దాచుకోవాల్సిందే. మట్టి రోడ్డులన్నీ మరణాలను దగ్గరగా చూసినవే. ఆ యమపాశానికి అందకూడదంటే శిరస్త్రాణం ధరించి తీరాల్సిందే. కొడుకులను పోగొట్టుకున్న తల్లులు, తండ్రులను పోగొట్టుకున్న బిడ్డలు, కూతుళ్లను పోగొట్టుకున్న అమ్మానాన్నల ఆర్తనాదాలు ఊరూరా ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి. ఆ శోకం దరి చేరకూడదంటే హెల్మెట్ అనే రక్షణను పొందాల్సిందే. జుత్తు పాడైపోతుందని, బరువుగా ఉందని కారణాలు చూపితే.. మృత్యుదేవత ను ఆహ్వానించినట్టేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయినా.. కుటుంబ భారాన్నంతా భుజాలపై అవలీలగా మోసే పురుష పుంగవులకు హెల్మెట్ మోయడం పెద్ద బరువు కాదు. ఇంటితో పాటు ఆఫీసు పనినీ చక్కపెట్టే ఆడ పడుచులకు శిరస్త్రాణం ధరించడం కష్టం కాదు. ఇప్పటికైనా హెల్మెట్ ధరిద్దాం.. కుటుంబానికి శోకాన్ని దూరం చేద్దాం.

ధరిస్తే శిరస్త్రాణం..

నిలుస్తుంది ప్రాణం

- హెల్మెట్ ధరించక ప్రాణాలు కోల్పోతున్న యువత
- కఠిన చట్టాలు ఉన్నా పట్టించుకోని వైనం
- హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు



శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో ఉన్న ద్విచక్ర వాహనాలు ఎన్నో తెలుసా..? దాదాపు 4,10,065. ఇందులో హెల్మెట్ ధరించలేదని చలానాలు వేసిన బండ్ల సంఖ్య ఎంతో తెలుసా..? 2,02,866. హెల్మెట్‌ను జిల్లా వాసులు ఎంత అశ్రద్ధ చేస్తున్నారో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి. ఏటేటా ప్రమాదాలు జరుగుతున్నా, కళ్ల ముందే ఎందరో చనిపోతున్నా ఇంకా ద్విచక్ర వాహనదారుల కళ్లు తెరచుకోవడం లేదు. ఏవేవో కారణాలు చూపిస్తూ హెల్మెట్‌ను పక్కన పెట్టేస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలను చేతులారా ఆహ్వానిస్తున్నారు.

ప్రమాదాల సంఖ్య ఇలా..

జిల్లాలో 2021 నుంచి ఈ ఏడాది జూలై 5 వరకు చూసుకుంటే 2814 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 971 మంది ప్రాణాలు కోల్పోయారు. జూన్ ముగింపు వరకు బైక్ ప్రమాదాలకు గురైన వారు 1366 మంది కాగా 410 మంది చనిపోయారు. 1391 మంది గాయపడ్డారు. హెల్మెట్లు పెట్టుకోవాలని పోలీసులు సూచిస్తున్నా బరువు ఎక్కువ అని, మాటిమాటికీ తీయాల్సి ఉంటుందని, నెమ్మదిగానే వెళ్తున్నామని రకరకాల కారణాలు చెబుతూ అశ్రద్ధ చేస్తున్నారు.

హైకోర్టు ఉత్తర్వులు..

ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ ధరించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలని హైకోర్టు చెప్పింది. ఈ విషయంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించరాదని తీర్పునిచ్చింది. ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యలతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ ఉత్తర్వులు జారీ చేసింది. హెల్మెట్ పెట్టుకోకుండా బండి తీస్తే జరిమానాలు విధించాలని సూచించింది.

నగరంలో డేంజర్ జోన్లు..

బైక్ రైడర్ల వల్ల దాదాపు అన్ని ఊళ్లలో డేంజర్ జోన్లు ఏర్పడ్డాయి. మరీ ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల రోడ్డు మలుపు, అరసవిల్లి మిల్లు, 80 ఫీట్ రోడ్డు, డేఅండ్‌నైట్, ఖైరి, బలగ, ఆదివారం పేట కూడళ్ల మార్గాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా 80 ఫీట్ రోడ్డులో సాయంత్రం అయితే చాలు బైక్ రేసింగ్ చేసే కుర్రాళ్ల ఆగడాలు అన్నీ..ఇన్నీ కావు. గత ఏడాది 68 ప్రమాదాలు జరిగితే ఏడుగురు చనిపోగా ఈ ఏడాది ఇప్పటికే 30 ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు.



ప్రయోజనాలెన్నో..


తలకు రక్షణ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురైతే దాని ప్రభావం గణనీయంగా తగ్గుతుంది. తలకు తగిలిన గాయం తీవ్రత తగ్గుతుంది. పుర్రె పగుళ్ల ప్రమాదం తగ్గుతుంది.

మెదడుకు రక్షణ ప్రమాద సమయంలో హెల్మెట్ అనేది తలకు కుషన్‌లా పనిచేస్తుంది. తద్వారా మెదడుకు గాయాలు (ట్రమాటిక్ బ్రెయిన్ ఇంజ్యూరీస్) కాకుండా సహాయపడుతుంది.

ఫేస్ ప్రొటెక్షన్ చాలా హెల్మెట్‌లు ఫేస్ షీల్డ్ లేదా వైజర్‌ను కలిగి ఉంటాయి. ఇవి ప్రమాదాల సమయంలో అలాగే ప్రతికూల వాతావరణంలో ముఖాన్ని రక్షిస్తాయి.


కంటి రక్షణ వైజర్ లేదా గాగుల్స్‌తో కూడిన హెల్మెట్‌లు గాలి, దుమ్ము, సూక్ష్మ స్థాయి చెత్త, క్రిమి కీటకాల నుంచి కళ్లను రక్షిస్తాయి.

ధ్వని తీవ్రత తగ్గింపు కొన్ని హెల్మెట్‌లు చెవి రక్షణ బాధ్యత కూడా నిర్వర్తిస్తాయి. హెల్మెట్ పెట్టుకుంటే శబ్ద కాలుష్యం తక్కువగా ఉంటుంది. ప్రమాద సమయంలో వినికిడి దెబ్బతినే ప్రమాదం తగ్గుతుంది.



- హెల్మెట్ ధారణపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా చాలా మంది మారడం లేదు.
- కేవలం పోలీసులు చలానా విధిస్తారనే భయంతోనే ఎక్కువ మంది పోలీసులు కనిపించగానే హెల్మెట్ ధరిస్తూ వారిని దాటి వెళ్లిపోయాక తీసేస్తున్నారు.
- ఇంకొందరైతే బయట ఊరికి వెళ్తేనే హెల్మెట్ ధరిస్తున్నారు.
- హాఫ్ హెల్మెట్లు కొందరు పెట్టడం, హెల్మెట్లు ధరించినా స్ట్రాప్ బిగించకపోవడం, వెంటే తీసుకెళ్లినప్పటికీ కేవలం జంక్షన్లు, పోలీసులు సమీపిస్తున్నప్పుడే తలకు పెట్టుకోవడం వల్ల ప్రమాదాలకు గురైనప్పుడు ఏకంగా ప్రాణాలు కోల్పోతున్నారు.





విత్‌అవుట్ హెల్మెట్ కేసులు/ చలానాలు	
2021	56,238
2022	90,350
2023	41,867
2024	14,411
మొత్తం	2,02,866



మీ చేతుల్లోనే ఉంది..



రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు బైక్ రైడర్స్‌వే. అందులోనూ హెల్మెట్ లేక తలకు గాయమై చనిపోతున్నారు. హెల్మెట్ పెట్టుకుంటే మిమ్మల్ని మీరు రక్షించుకున్నట్లే. మీ చేతుల్లోనే అంతా ఉంది. రైడర్లు హెల్మెట్ పెట్టుకోవాలి.

– జీఆర్ రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం

హెల్మెట్ ధారణ తప్పనిసరి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



శ్రీకాకుళం పాతబస్టాండ్: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయసదన్‌లో కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం వాహన చోదకుల రక్షణ కోసం ఏర్పాటు చేసినట్లు వివరించారు. బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు, సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ప్రెసిడెంట్, జిల్లా బార్ అసోసియేషన్ కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేత్రోత్సవ వేళ..




జగన్నాథుడి రథయాత్ర నేడు అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా శ్రీకాకుళం బొందిలీపురంలోని జగన్నాథ స్వామి దేవాలయంలో శనివారం నేత్రోత్సవం నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 75వ జయంతిని ఈ నెల 8న ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 8న జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ఏ మహనీయుడి స్ఫూర్తితో తమ పార్టీని ఆరంభించామో అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రక్తదానం, స్కూల్‌లో పుస్తకాల పంపిణీ, రహదారులు, కాలనీల్లో చెట్లు నాటడం వంటి సేవా కార్యక్రమాలు ఎంచుకుని చేపట్టాలని సూచించారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుడు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో పార్టీ నాయకులు గొండు కృష్ణమూర్తి, శిమ్మ రాజశేఖర్, రౌతు శంకరరావు, పీస గోపి, గొండు రఘురాం, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఎంవీ స్వరూప్, పొన్నాడ రుషి, టి.కామేశ్వరి తదితరులు ఉన్నారు.

'అగ్నివీర్ నోటిఫికేషన్‌ను సద్వినియోగం చేసుకోండి'



శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అగ్నివీర్ నోటిఫికేషన్ వెలువడిందని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. భారత ప్రభుత్వం నుంచి కమాండింగ్ ఆఫీసర్-12 ఎయిర్‌మెన్ సెంటర్, సికింద్రాబాద్ వారి నుంచి అగ్నివీర్ నోటిఫికేషన్ వెలువడినట్లు పేర్కొన్నారు. స్త్రీ/పురుషులు ఇరువురూ అర్హులేనని 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలని స్పష్టంచేశారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. లేదా 50 మార్కులతో పాలిటెక్నిక్ ఉత్తీర్ణులై, ఇంగ్లిష్‌లో 50 మార్కులతో పాసైనవారు అర్హులని తెలిపారు. లేదా ఇంటర్ ఒకేషనల్ చదివి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన స్త్రీ, పురుషులు ఈ నెల 8 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కొత్తలంక సుధ సూచించారు.

8 నుంచి నూతన ఇసుక విధానం ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన ఇసుక విధానం ఈ నెల 8 నుంచి ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూగర్భ గనుల శాఖకు సంబంధించి నూతన ఇసుక విధానంపై ఆయన జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, జిల్లా జాయింట్ కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఇసుక పాలసీ ఈ నెల 8వ తేదీ నుంచి సెప్టెంబరు వరకు ఉంటుందన్నారు. స్టాక్ పాయింట్లో ఉన్న నిల్వలు, డి సీల్టేషన్ ద్వారా తీసిన ఇసుకను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ముందుగా పెన్షన్ల పంపిణీపై జిల్లా కలెక్టర్లను ఆయన అభినందించారు. పెన్షనర్లకు జీపీఎస్ లింక్ చేయాలని తెలిపారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, భూగర్భ గనుల శాఖ ఉప సంచాలకులు ఎస్‌కే సత్యనారాయణ, ఎస్ఈబీ అదనపు ఎస్పీ గంగాధరం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జీజే బెన్హర్, ఏడీడీ ఫణి భూషణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి కేజీబీవీలో

ఫుడ్ పాయిజన్



కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- విద్యార్థులకు డయేరియా
- కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో 22 మంది చేరిక

కోటబొమ్మాళి:

కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఫుడ్ పాయిజన్ కావడంతో 22 మంది విద్యార్థినులు డయేరియా బారిన పడ్డారు. వాంతులు, వి రేచనాలతో బాధ పడుతున్న విద్యార్థులను కోటబొ మ్మాళి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. కేజీబీవీలో శుక్రవారం మధ్యా హ్నం భోజనాల అనంతరం కొందరు విద్యార్థినులకు వాంతులయ్యాయి. మరికొందరికి విరేచనాలు అయ్యాయి. అయితే విషయం బయటకు తెలియనివ్వకుండా గోప్యంగా ఉంచారు. కానీ శనివారం ఉదయానికి 22 మందికి డయేరియా లక్షణాలు కనిపించడంతో కేజీబీవీ సిబ్బంది అప్రమత్తమయ్యా రు. కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ ప్రశాంతి వారం రోజులుగా టెక్కలిలో శిక్షణకు వెళ్తున్నారు. ఇక్కడ ఏఎన్‌ఎం కూడా లేకపోవడంతో విద్యార్థినులకు సకాలంలో వైద్య సేవలు అందలేదు. విద్యార్థినులు ఒక్కొక్కరిగా అనారోగ్యం బారిన పడుతుండడంతో సిబ్బంది ప్రిన్సిపాల్‌కు సమాచారం అందజేశారు. ఆమె కొత్తపేట సచివాలయం ఏఎన్‌ఎంకు విషయం చెప్పడంతో అక్కడి నుంచి తిలారు పీహెచ్‌సీకి సమాచారం అందింది. దీంతో వెంటనే డాక్టర్ మెండ మనీషా కేజీబీవీకి వెళ్లి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడే మెడికల్ క్యాంపు పెట్టి చికిత్స చేశారు. కానీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో విద్యార్థినులకు కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కొందరు కోలుకుంటున్నారని, మిగిలిన వారికి చికిత్స అందిస్తున్నామని సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పొన్నాడ గణేష్ తెలిపారు. జీసీడీఓ నీరజ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు.

నాసిరకం ఆహారం వల్లనేనా..?

కేజీబీవీకి ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన గుడ్లు, కూరగాయలు, పాలు సరఫరా చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీని వల్లే డయేరియా వ్యాపించి ఉంటుందని విద్యార్థినుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. డాక్టర్ మెండ మనీషా మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ కారణంగానే డయేరియా వ్యాప్తి చెందినట్లు తెలిపారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానాను కొత్త కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

టెక్కలి: మండలంలోని పెద్దరోక్కళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన గంధావు శివానంద్ అనే ఉపాధ్యాయుడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు మండల విద్యాశాఖాధికారి డి.తులసిరెడ్డి శనివారం తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పెద్దరోక్కళ్లపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తమ్మినేని శ్రీనివాసరావు, సహోపాధ్యాయుడు శివానంద్ మధ్య జరిగిన తగాదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వరకు చేరింది. ఈ నేపథ్యంలో అప్పట్లో శ్రీనివాసరావును సస్పెండ్ చేసి మరలా పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఇదే ఘటనలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా శివానంద్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

పట్టుబడిన మేకల దొంగ

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్రలో మేకపోతును దొంగిలించిన యువకుడు స్థానికులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సుమారు రూ.20 వేల విలువైన మేకపోతును ముగ్గురు యువకులు కాళ్లు కట్టేసి బైకుపై తరలిస్తుండగా యజమాని జినగ కేశవరావు గుర్తించాడు. వెంటనే పారిపోవడానికి యువకులు ప్రయత్నించడంతో స్థానికులు స్పందించి అందులో ఒకరిని పట్టుకున్నారు. యువకుడిని బస్టాండ్ వద్దకు తీసుకొచ్చి స్తంభానికి కట్టేశారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు యువకుడిని విడిపించి అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరంతా పలాస-కాశీబుగ్గలోని సాయిబులకాలనీలో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారని, మేకపోతులు చోరీ చేస్తూ జల్సాలు చేసుకుంటున్నట్లు గుర్తించారు. పట్టుబడిన యువకుడు పాతపట్నంకు చెందిన వాడు కాగా, మరో ఇద్దరు సాయిబులకాలనీకి చెందిన వారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రైలు ఢీకొని ఆవు మృతి

టెక్కలి రూరల్: టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం రాజారాణీ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఆవు మృతిచెందింది. గుణుపూర్ నుంచి నౌపడ వైపు వెళ్లే రాజారాణి ఎక్స్‌ప్రెస్ టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి పక్కన మేత మేస్తున్న ఆవు ఒక్కసారిగా పరుగు తీసి రైలు కిందకు దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న లోకో పైలట్ రైలును కొంత సమయం ఆపి ఆవు కళేబరాన్ని బయకుతీసే ప్రయత్నం చేశారు అయిన ఫలితం లేకపోవడంతో రైలు అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆవు యజమాని వివరాలు తెలియలేదు.

గెడ్డలో జారిపడి..

వజ్రపుకొత్తూరు: మండలంలోని అనంతగిరి గ్రామంలో పాడి రైతు బదకల ప్రకాష్‌కు చెందిన పాడి ఆవు శనివారం మృతి చెందింది. గెడ్డ గట్టుపై నుంచి జారిపడిపోవడంతో నీరు తాగి అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవలే రూ.70వేలకు ఈ ఆవును కొనుగోలు చేశారు. మృతిచెందిన విషయాన్ని వజ్రపుకొత్తూరు పశువైద్యాధికారి ఎం.పాపారావు దృష్టికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్ : మండలంలోని కె.కొత్తూరు గ్రామ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అరసవల్లి శంకరరావు(30) శనివారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతిచెందాడు. శంకరావు గ్రామంలో కర్రపని చేసేవాడు. పని నిమిత్తం తన ద్విచక్రవాహనం పై టెక్కలి వచ్చి తిరిగి వెళ్తుండగా టెక్కలి మండలం కె.కొత్తూరు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సామగ్రిని స్వాధీనం చేసుకున్న కొత్తూరు సెబ్ స్టేషన్ సిబ్బంది

కొత్తూరు: మండలంలోని డెప్పిగూడ గిరిజన గ్రామం సమీపంలో శనివారం సెబ్ ఎస్‌ఐ శ్రావణి, పలాస్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లం ఊట, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.







● టీకాతో వ్యాధులకు చెక్

జునోసిస్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయం వద్ద శనివారం పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశు వైద్యాధికారులు, వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ జాతులకు చెందిన కుక్కలను తీసుకురావడంతో సందడి వాతావరణం నెలకొంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

పశు వ్యాధులకు.. వ్యాక్సిన్లే రక్ష



మేత మేస్తున్న పశువులు

- ముందస్తుగా టీకాలు తప్పనిసరి
- అజాగ్రత్త వహిస్తే మూగజీవాల ప్రాణాలకే ముప్పు
- జిల్లాలో కొనసాగుతున్న వ్యాక్సినేషన్

ఆవులు	134562
గేదెలు	102768
గొర్రెలు	100232
మేకలు	106451
మొత్తం పశుసంపద	443713
వ్యాక్సిన్ వేసినవి	322673

సరుబుజ్జిలి: పశువులకు వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేయడం తప్పనిసరి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మూగజీవాల ప్రాణాలకు ముప్పు తప్పదు. ఇటీవల పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోతుల్లో నీరు చేరింది. కలుషిత నీరు, ఇతరత్రా కారణాల వల్ల పశువులు కూడా అనేక రకాల అంటువ్యాధుల బారిన పడే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో పశు సంవర్ధక శాఖాధికారులు ముందుస్తుగా పశువులకు జబ్బు, చిటుకువ్యాధుల నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నారు.

➺ **చిటుకు వ్యాధి:** గొర్రెల్లో చిటుకువ్యాధి అధికంగా కనిపిస్తుంది. ఇది బ్యాక్టీరియా వల్ల సంక్రమిస్తుంది. ఒక్కసారిగా ఎగురుతూ గొర్రెలు చనిపోతాయి. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ముందుగా నీరసంగా ఉన్న గొర్రెలను మంద నుంచి వేరుచేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధి సోకని వాటికి వ్యాక్సిన్ వేయించాలి.

➺ **నీలినాలుక:** ఈ వ్యాధి గొర్రెలు, మేకల్లో కనిపిస్తుంది. జీవాలకు తీవ్ర జ్వరం వస్తుంది. నోటి నుంచి సొంగ కారుస్తూ, గిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. వ్యాధి నివారణకు యాంటీ బయాటిక్స్, లివర్‌టానిక్ ఉపయోగించి జీవాలను వేరుచేయాలి.



పొదుగు వ్యాధితో బాధపడుతున్న పశువు

➺ **గొంతువాపు:** ఈ వ్యాధి ఆవులు, గేదెల్లో కనిపిస్తుంది. 105 నుంచి 108 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి నుంచి సొంగ కారుతుంది. నోటి ద్వారానే గాలి పీల్చుకుంటాయి. గొంతు వద్ద వాపు వల్ల మేత తీసుకోలేవు. దీని నివారణకు సల్ఫాడిమిడిన్ వాడాలి. నాలుగు నెలలు దాటిన జీవాలకు వ్యాక్సిన్ వేయించాలి.

➺ **గాలికుంటు:** ఇది అన్ని జీవాల్లో కనిపిస్తుంది. నోటి, గిట్టల్లో పుండ్లు, ఎక్కువగా జ్వరం వస్తుంది. దీని నివారణకు బోరిక్‌గ్లిజరిన్ ఆయింట్‌మెంట్‌ను నోటిలో పూత పూయాలి. పీపీ ద్రావణంతో కాలి గిట్ల మధ్య కడగాలి. ఏటా ముందస్తుగా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ వేయించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి..



రైతులు దాణాలు అందుబాటులో ఉంచుకోవాలి. తడిచిన దాణా వినియోగించరాదు. పశువులు షెడ్లు పరిశుభ్రంగా ఉంచాలి. వర్షాలు, వరదల సమయంలో జంతువులు చనిపోతే విసిరేయకుండా కాల్చడం, పూడ్చడం చేయాలి. పశు వ్యాధులపై రైతుసేవా కేంద్రాలకు అనుసంధానంగా ఉన్న విలేజ్ పశువైద్య సహాయకుల ద్వారా పెంపకందారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సీహెచ్ సుబ్రహ్మణ్యం, జిల్లా సహాయ సంచాలకుడు, పశుసంవర్ధక శాఖ

సెంచూరియన్‌లో 'జునోసిస్ డే'



పెంపుడు కుక్కల సంరక్షణపై కరపత్రం విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లోని ఓపెన్ ఆడిటోరియంలో ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య డీఏన్‌రావు మాట్లాడుతూ.. పెంపుడు కుక్కలకు సాధారణంగా వచ్చే జునోటిక్ వ్యాధులను నియంత్రించడంలో సాధించిన పురోగతి, వాటి ప్రాముఖ్యతను చాటి చెప్పడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. ఐకార్-సిఫా (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్) ప్రొ.ప్రియబ్రతా స్వయిని పెంపుడు జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కాంప్లెక్స్‌లో 32 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు. అనంతరం పెంపుడు కుక్కల సంరక్షణపై అవగాహనకు కరపత్రం విడుదల చేశారు. అంతకుముందు వెటర్నరీ స్కూల్ అండ్ సైన్సెస్ డీన్ రాజేంద్ర కుమార్ స్వయిని, అగ్రికల్చర్ కళాశాల డీన్ ప్రొ.ఎస్పీ నందా, రిజిస్ట్రార్ డా.అనితా పాత్రోలను సత్కరించారు.

నెల రోజుల్లోనే ఇన్ని దారుణాలా?



దగ్ధమైన కారును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

- వైఎస్సార్‌సీపీ నేత కారు దగ్ధం ఘటనను ఖండించిన మాజీ ఎమ్మెల్యే కిరణ్
- కూటమి ప్రభుత్వంపై మండిపాటు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గం 20 ఏళ్లుగా ఎంతో ప్రశాంతంగా ఉందని, కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లో అనేక దారుణాలు చూస్తున్నామని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. రణస్థలం మండలం నారువ పంచాయతీలో గల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల అసిరయ్య కారును శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి కాల్చేశారు. విషయం తెలుసుకున్న కిరణ్ శనివారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి కారు దగ్ధమైన తీరును పరిశీలించారు. అసిరయ్యకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు కారును తగలపెట్టారని, అదే మనుషులు అడ్డం ఉంటే ఇలానే చేస్తారా అని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వచ్చిన నెలరోజుల్లో ఎక్కడిక్కడే వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం చేయడం, భవనాలు కూల్చివేయడం, వైఎస్సార్, జగన్ పేర్లు తొలగించడం, కార్యకర్తలపై దాడులకు పాల్పడడం చూస్తున్నామని ఇలాంటి సంస్కృతి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. కూటమి నాయకుల దుశ్చర్య తట్టుకోలేక ఎచ్చెర్ల ఎంపీడీఓ సెలవుపై వెళ్లిపోయారని, పూడివలస పంచాయతీ కార్యదర్శి ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారని, అలాగే ఉన్నతమైన స్థానాల్లో ఉన్న వీసీలను బెదిరించి రాజీనామా చేయిస్తున్నారని, పరిశ్రమలపై అజమాయిషీ చెలాయిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ, కలెక్టర్లు దృష్టికి తీసుకువెళ్తామని, ఇలాంటి చర్యలను పూర్తిగా వైఎస్సార్‌సీపీ ఖండిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, నారువ, మెంటాడ పంచాయతీ నాయకులు ఉన్నారు.

శనగపంట ధ్వంసం



నిమ్మాడలో అప్పన్నకు చెందిన శనగ పంటలో ధ్వంసమైన కొంత భాగం

టెక్కలి: తనకు చెందిన సుమారు 80 సెంట్లు శనగ పంటను గుర్తు తెలియని వ్యక్తులు పశువులతో మేత మేయించి ధ్వంసం చేశారని కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కింజరాపు అప్పన్న ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొంత మంది కక్ష కట్టి తనతో పాటు కుటుంబ సభ్యులపై ఇటువంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఇలాంటి చర్యల నుంచి తనకు రక్షణ కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే పంపిణీ
- అధికారులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ భూగర్భ గనుల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లతో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుకను స్వాధీనం చేసుకోవాలన్నారు. అంగూరు, టెక్కలి స్టాక్ పాయింట్‌లో మెట్రిక్ టన్ను ఇసుక రూ.340గా నిర్ణయించినట్లు తెలిపారు. వీఆర్‌ఓ, భూగర్భ గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్, పోలీస్ కానిస్టేబుల్ స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తారన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక పంపిణీ చేపట్టాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి క్యూఆర్ కోడ్ యూపీఐ ద్వారా చెల్లింపులు చేపట్టాల్సి ఉందన్నారు. వినియోగదారులకు రశీదు ఇవ్వాలని చెప్పారు. ప్రస్తుతం టెక్కలి పాయింట్ వద్ద 8 వేల మెట్రిక్ టన్నులు, అంగూరు పాయింట్ వద్ద 40 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందన్నారు. మొదట ప్రాధాన్యతగా ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేయించాల్సి ఉందన్నారు. తర్వాతే ఆరు టైర్ల లారీలకు లోడింగ్ అనుమతించాలన్నారు. ముందుగా గృహ నిర్మాణాలకు, తర్వాత బిల్డర్లకు సరఫరా చేస్తామన్నారు. ట్రోల్ ఫ్రీ నంబర్ పెట్టి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస ఆర్డీఓ డాక్టర్ భరత్ నాయక్, శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, సెబ్ అదనపు ఎస్పీ గంగాధరం, భూగర్భ శాఖ ఉప సంచాలకులు ఎస్.కె.వి.సత్యనారాయణ, డీపీఓ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జి.జె.బెన్హర్, భూగర్భ శాఖ ఏడీ డి.ఫణి భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్...



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బొంతలకోడూరులో సర్వే నంబర్-39లో ఉన్న 2.61 ఎకరాల మల్లిపెద్దవాని చెరువుపై అధికార పార్టీ నాయకుల కన్ను పడటం, ఆక్రమణలకు సిద్ధం కావడంపై 'చెరువుపై అధికార పార్టీ నాయకుల కన్ను' అనే శీర్షికతో శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించి రెవెన్యూ అధికారులను వివరణ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఎం.శ్యాంకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శనివారం చెరువును పరిశీలించి నివేదిక అందజేశారు. చెరువులో ఆక్రమణలు పూర్తిగా తొలగించామని చెప్పారు. 2021లో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా చర్యలు అప్పట్లో తీసుకున్నట్లు తెలిపారు. చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు సైతం తీసుకున్నట్లు వివరించారు. బెహరా భానుమూర్తి అనే వ్యక్తి 2022 సెప్టెంబర్ 26న ఉపాధి పనుల్లో భాగంగా రూ. 9 లక్షలు నిధులు మంజూరు చేసి పూడికలు తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆక్రమణలు జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఎస్ఎల్ఆర్ ఆధారంగా సమగ్ర సర్వే నిర్వహించగా సర్వే నంబర్ 39లో ఎఫ్ఎంబీ ప్రాప్తికి సర్కారు పోరంబోకు బంద 2.6 ఎకరాలు మల్లపెద్దివాని చెరువుగా నమోదై ఉందని వివరించారు. చెరువు స్థలంలో ఎవరికీ పట్టాలు అందజేయలేదని స్పష్టం చేశారు. 70 ఎకరాల ఆయకట్టు సైతం ఉందని స్పష్టం చేశారు. ప్రతి రోజూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గ్రామ రెవెన్యూ అధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. కలెక్టర్ స్పందనపై గ్రామస్తులు, ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిత్యావసర సరకుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హోల్‌సేల్ డీలర్లకు సూచించారు. బియ్యం, పప్పులు, నూనె, పంచదార ధరల రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో హోల్‌సేల్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లు, వినియోగదారులు నష్టపోకుండా ధరల తగ్గింపుపై చర్చించారు. సరుకులు ఉండి లేవని చెప్పి నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం తరపున కంది పప్పు విక్రయించేందుకు షాపులు గుర్తిస్తామన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బి.శాంతి శ్రీ, జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, మార్కెటింగ్ ఏడీ జె.ఎస్.నాగలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

9న డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ చివరి ఏడాది ఒకే సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థుల కోసం ఈ నెల 9న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం చెప్పారు. 256 మంది అర్హులు ఉండగా 237 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో శనివారం స్టేట్ టీమ్ నిర్వహించిన ఎరువుల షాపుల తనిఖీల్లో రూ.8.01,937 లక్షల విలువ కలిగిన ఎరువులు, పురుగుల మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. పట్టణంలో మూడు షాపుల్లో తనిఖీలు చేపట్టగా సరైన పత్రాలు లేకుండా ఎరువులు, పురుగుల మందులు ఉన్నట్లు స్టేట్ టీమ్ సభ్యులు, తాడేపల్లిగూడేం ఏడీ పీ.మురళీ కృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ కిరణ్ కుమార్ బృందం గుర్తించిందని వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. వారం లోగా పత్రాలు సరిచేసుకోమని ఆదేశించినట్లు చెప్పారు. తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈయన వెంట నరసన్నపేట ఏడీ రవీంద్ర భారతి, ఏఓ కె.సునీత, జిల్లా వ్యవసాయ శాఖ క్వాలిటీ కంట్రోల్ ఏఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.